సాక్షి
నిజామాబాద్
గురువారం । 12 । అక్టోబర్ । 2023



దరఖాస్తులకు మోక్షమెప్పుడో?
ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉంటుండడంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు.
- 10లో ▸



తనిఖీల జోరు..
ఎన్నికల కోడ్ దృష్ట్యా జిల్లావ్యాప్తంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. భారీగా నగదు స్వాధీనం చేసుకుంటున్నారు.
- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.5 /23.4

వాతావరణం
వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. పొగమంచు కురుస్తుంది.

సీపీ బదిలీకి ఈసీ ఆదేశం

- అదనపు డీసీపీ జయరాంకు ఇన్‌చార్జి బాధ్యతలు
- ఆరోపణల నేపథ్యంలోనేనని చర్చ!



ఖలీల్‌వాడి : నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణను బదిలీ చేయాలని కేంద్ర ఎలక్షన్ కమిషన్ బుధవారం రాత్రి ఆదేశాలు జారీ చేసింది. జిల్లా సీపీగా సత్యనారాయణ సెప్టెంబర్ 2న బాధ్యతలు స్వీకరించారు. 40 రోజులు ఆయన విధుల్లో ఉన్నారు. ఆకస్మికంగా సీపీ బదిలీ చేయడం పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గురువారం సాయంత్రం 5 గంటల్లో గా వీరి స్థానంలో కొత్త అధికారులను నియమించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. 2023 శాసనసభ ఎన్నికలు ముగిసే వరకు వీరిని ఎన్నికల విధుల్లో వినియోగించరాదని ఆదేశించింది. ఎన్నికల్లో పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో అదనపు డీసీపీ జయరాంకు ఇన్‌చార్జి బాధ్యతలిచ్చారు. కామారెడ్డి ఎస్పీ శ్రీనివాసరెడ్డి బదిలీ కాగా అడిషనల్ ఎ స్పీ నర్సింహారెడ్డికి అదనపు బాధ్యతలిచ్చారు.

అందని సమాచారం!

- స.హ. చట్టాన్ని పట్టించుకోని అధికారులు
- పేరుకుపోయిన అప్పీళ్లు, ఫిర్యాదులు
- నేడు స.హ. చట్టం అమలు దినోత్సవం



నిజామాబాద్‌అర్బన్ : పాలనలో పారదర్శకత నెలకొనాలి.. అధికారుల్లో జవాబుదారీతనం పెంపొందించాలి.. అవినీతిని అంతమొందించాలి.. ప్రజాధనం దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలనే ఆశయంతో అమల్లోకి వచ్చిన చట్టం సమాచార హ క్కు చట్టం. కానీ ఈ చట్టం ఆశయాలు నెరవేరడం లేదు. ఇంతటి విలువైన చట్టం ఉమ్మడి జిల్లాలో సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదు. చట్టం గురించి పట్టించుకోవాల్సిన అధికారులే గాలికి వదిలేశారు. మరోవైపు సమాచార కమిషనర్ల పదవీ కాలం ముగియడంలో కమిషన్ ఖాళీ అయింది. దీంతో అప్పీళ్లు, ఫిర్యాదులు పరిష్కరించే వారు కరువయ్యారు. అలాగే 17 అంశాల 4(1)బి సమాచారాన్ని చాల ప్రభుత్వ కార్యాలయాలు అప్‌డేట్ చేయడం లేదు. నేడు జాతీయ సమాచార హక్కు అమలు దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

సమాచారం తెలుసుకోవడం పౌరుల హక్కు. స.హ. చట్టం సెక్షన్ 6 ప్రకారం దరఖాస్తు చేస్తే సెక్షన్ 7(1) ప్రకారం 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలి. కానీ అలా ఇవ్వడం లేదు. కొందరు అధికారులు కుంటి సాకులు వెతికి దరఖాస్తుదారులను ఇబ్బందులు పెడుతున్నారు. దరఖాస్తుకు సంబంధించిన సమాచారం తమ కార్యాలయంలో లేకపోతే సెక్షన్ 6(3) ప్రకారం ఆ దరఖాస్తును ఐదు రోజుల్లో సంబంధిత ఆఫీస్‌కు పంపాలి. కానీ 30 రోజుల తర్వాత దరఖాస్తును బదిలీ చేస్తున్నారు. దీంతో సమాచారం పొందడంలో ఆలస్యం అవుతోంది. మరికొన్ని దరఖాస్తులను ఇది సెక్షన్ 2(ఊ) ప్రకారం సమాచారం కిందకు రాదని తిరిగి పంపిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులు మొదటి అప్పీలు చేసిన స్పందన లేక సమాచార కమిషన్ను ఆశ్రయిస్తున్నారు. కానీ ప్రస్తుతం సమాచార కమిషనర్లు ఎవరు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా నుంచి వెళ్లిన 1,822 అప్పీళ్లు, ఫిర్యాదుల్లో ఇప్పటివరకు 1,084 మాత్రమే పరిష్కారం అయ్యాయి.

సంవత్సరం	వచ్చినవి		పరిష్కరించినవి	
	అప్పీళ్లు	ఫిర్యాదులు	అప్పీళ్లు	ఫిర్యాదులు
2017	162	155	150	123
2018	141	114	123	96
2019	161	101	129	89
2020	147	115	79	76
2021	151	139	66	51
2022	141	120	43	30
2023	99	76	16	13
మొత్తం	1002	820	606	478

సమీక్షలు కరువు

సాధారణ పరిపాలన శాఖ 2013లో ప్రతి జిల్లాలో అధికారులు, ఉద్యమకారులతో కలసి కమిటీలు వేసింది. ఈ కమిటీ స.హ. చట్టం అమలు తీరును పర్యవేక్షించాలని ఆదేశించింది. కానీ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఇంతవరకు కమిటీలు ఏర్పాటు కాలేదు. అలాగే ప్రతి మూడు నెలలకు జిల్లా నోడల్ అధికారి అయిన అదనపు కలెక్టర్ చట్టం అమలు తీరుపై సమీక్షలు చేయాలి. కానీ రెండు జిల్లాల్లో సమీక్షలు తూ తూ మంత్రంగా జరుపుతున్నారు. సమీక్షలకు ఉద్యమకారులను పిలువడం లేదు.

వారితో ఇబ్బందులు

స.హ. చట్టంతో సామాన్య ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. కానీ కొందరు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. అదేపనిగా ఎక్కువ సంఖ్యలో పిటిషన్లు వేస్తున్నారు. దీంతో ఇతర పిటిషన్ దారులకు సమాచారం అందడంలో ఆలస్యం అవుతోంది. వారి తీరుతో అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు.

సకాలంలో సమాచారం ఇవ్వాలి



పౌరులు దరఖాస్తు పెట్టిన 30 రోజుల్లో అధికారులు సమాచారం అందించాలి. సమాచార కమిషనర్లు లేక అప్పీళ్లు, ఫిర్యాదులు పేరుకుపోయాయి. 4(1) బి సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలి.

– అంకం నరేశ్, స.హ. రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు

ప్రాంతీయ కమిషన్లను ఏర్పాటు చేయాలి



సమాచారం ఇవ్వడంలో అధికారులు సహాయ నిరాకరణ చేస్తున్నారు. చాలా దరఖాస్తులకు సకాలంలో సమాచారం ఇవ్వట్లేదు. పాత 10 జిల్లాల్లో ప్రాంతీయ కమిషన్ ఆఫీస్‌లను ఏర్పాటు చేసి కమిషనర్లను నియమిస్తే అప్పీళ్లు, ఫిర్యాదులు పరిష్కారం అవుతాయి. – పెద్ద మురళి, స.హ. రక్షణ వేదిక ప్రధాన కార్యదర్శి

సరిహద్దుల్లో పక్కాగా నిఘా



సాలూర్ వద్ద చెక్‌పోస్ట్ ఫ్లెక్సీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ

- చెక్‌పోస్టుల్లో నిరంతర తనిఖీలు
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- సాలూర అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు పరిశీలన

బోధన్ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళిని పటిష్టంగా అమలు చేసే చర్యల్లో భాగంగా అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాటు నిరంతరం తనిఖీలు ఉంటాయని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. బుధవారం సీపీ సత్యనారాయణ, ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ కిరణ్‌కుమార్‌లతో కలిసి ఆయన మహారాష్ట్ర సరిహద్దులోని సాలూర అంతర్రాష్ట్ర ఉమ్మడి చెక్‌పోస్టును పరిశీలించారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దులోని సాలూర, కందకుర్తి, ఖండ్‌గాం, పోతంగల్ గ్రామాల వద్ద నాలుగు చోట్ల ఉమ్మడి చెక్ పోస్టులు, మరో ఆరు చోట్ల అంతర్ జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు చెక్‌పోస్టుల్లో తనిఖీలు కొనసాగుతాయన్నారు. పోలీస్, రెవెన్యూ, ఫారెస్టు, రవాణా, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖలు ఉమ్మడిగా తనిఖీలు నిర్వహిస్తాయన్నారు. ఇతర రాష్ట్రాల్లోంచి తెలంగాణలోకి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీలు చేస్తారని, అక్రమ మద్యం, నగదు రవాణకు పాల్పడితే వాటిని గుర్తించి సీజ్ చేస్తామన్నారు.

ఈ తనిఖీల వల్ల సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ఎవరైనా నగదును వెంట పెట్టుకుని ప్రయాణాలు చేయాల్సి వస్తే ఆధారాలు వెంట ఉంచుకోవాలని, లేకపోతే జప్తు చేస్తామన్నారు. తహశీల్దార్ మల్లయ్య, అధికారులు పాల్గొన్నారు.

పంపిణీ కేంద్రం పరిశీలన

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలోని విజయమేరి పాఠశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేసే కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ పరిశీలించిన అనంతరం మాట్లాడారు. నవంబర్ 30వ తేదీన శాసన సభ ఎన్నికలు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలతో పాటు ఇతర సామగ్రి పంపిణీ చేయడానికి పాఠశాలను పరిశీలించామన్నారు. అభ్యర్థులు ఖరారైన తర్వాత ఈవీఎంలను ఆయా నియోజకవర్గాలకు పంపుతామని, ఓట్ల లెక్కింపు మాత్రం జిల్లా కేంద్రంలోనే ఉంటుందన్నారు. ఎన్నికలు నవంబర్ 30వ తేదీన ఉంటే 29వ తేదీన ఈవీఎంలు పంపిణీ చేస్తామన్నారు. ఆర్డీవో రాజాగౌడ్, ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ ప్రేంకుమార్, తహశీల్దార్ గంగాధర్, ఆర్‌ఐ వరుణ్ ఉన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

న్యూస్‌రీల్

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

ఖలీల్‌వాడి : జిల్లాలో ఈనెల 16వ తేదీ నుంచి 23 వరకు జరిగే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు సీపీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్ద పోలీసుల బందోబస్తు ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల పరిధిలో దుకాణ సముదాయాలు, జిరాక్స్ సెంటర్‌లను మూసిఉంచాలన్నారు.

బకెట్‌లో పడి బాలుడి మృతి



మాక్లూర్ : బకెట్‌లో పడి 15 నెలల బాలుడు మృతి చెందిన ఘటన మాక్లూర్ మండలం మెట్‌పల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. సర్పంచ్ చిన్‌రెడ్డి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నవీన్, వాణి దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం వారు గేదెలకు పెట్టడానికి బకెట్‌లో కుడితి కలిపి పెట్టారు. వారి రెండో కుమారుడు నిహేక్ష్(15 నెలలు) ఆడుకుంటూ వెళ్లి ఆ బకెట్‌లో పడ్డాడు. అక్కడే ఉన్న తల్లిదండ్రులు గమనించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

మెనూ ప్రకారం అల్పాహారం అందించాలి



ధర్పల్లి : విద్యార్థులకు పోషకాలతో కూడిన అల్పాహారాన్ని ప్రభుత్వం అందిస్తుందని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. ధర్పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు పెడుతున్న అల్పాహారాన్ని పరిశీలించారు. నాణ్యత పాటిస్తూ మెనూ ప్రకారం విద్యార్థులకు అల్పాహారాన్ని అందించాలని సూచించారు. హెచ్‌ఎం సుస్మిత ఉన్నారు.

విద్యుత్ వినియోగదారులకు అండగా పరిష్కార వేదిక



నిజామాబాద్‌నాగారం : వినియోగదారులకు విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలు అండగా ఉంటాయని విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్‌పర్సన్ ఈశ్వరయ్య అన్నారు. బుధవారం దుబ్బలోని మున్నూరు కాపు సంఘంలో వినియోగదారుల పరిష్కారవేదిక నిర్వహించారు. వినియోగదారుల సమస్యలకు సంబంధించి వినతులు స్వీకరించారు. ఫోరం సభ్యులు టెక్నికల్ ఎస్ రామకృష్ణ, రాజాగౌడ్, జి కృష్ణ, డి శ్రీనివాస్, ఏవో గంగారాంనాయక్, ఏడీఈ తోట రాజశేఖర్, చంద్రశేఖర్, వీరేశం, ఏఈలు రాంసింగ్, గంగాశేఖర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

బీసీ, దళిత బంధు పథకాలకు బ్రేక్

- ఎన్నికల కోడ్ నేపథ్యంలో..
- సంక్షేమ పథకాల అమలు వాయిదా



మోర్తాడ్(బాల్కొండ) : ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో బీసీ, దళితబంధు పథకాల అమలు వాయిదా పడింది. రెండో దశ బీసీ, దళితబంధు అమలుకు లబ్ధిదారుల ఎంపికలో జాప్యం చేయడంతో ఈ తంతును ఎన్నికల తర్వాతే కొనసాగించే అవకాశం ఉంది. బీసీలలోని కుల వృత్తుల వారికి రూ. లక్ష చొప్పున, దళితులకు రూ. 10 లక్షల చొప్పున స్వయం ఉపాధి కోసం 100 శాతం రాయితీతో పథకాలను అమలు చేస్తున్న విషయం విదితమే. దళిత బంధు రెండో విడతలో ఒక్కో నియోజకవర్గానికి 1,100 మందికి, బీసీల్లో 300 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేసి ఆర్థిక సాయం అందించాల్సి ఉంది. మొదటి విడత దళితబంధు గతేడాది అందించారు. ఈ ఏడాది ఆరంభంలోనే రెండో విడత అందించాల్సి ఉన్నా లబ్ధిదారుల ఎంపికలో తీవ్ర జాప్యం వల్ల పథకం అమలు ఆలస్యమైంది. బీసీ బంధు గడచిన ఆగస్టులో మొదటి విడత చెక్కులను పంపిణీ చేశారు. రెండో విడత సెప్టెంబర్‌లోనే అందించాల్సి ఉన్నా లబ్ధిదారుల ఎంపిక జరుగకపోవడంతో ఈ నెలలో అందించాలని నిర్ణయించారు. బీసీ సంక్షేమ శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖలు లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమం చేపట్టడానికి చర్యలు తీసుకున్నా ఎన్నికల నియమావళి అమలులోకి రావడంతో రెండు పథకాల అమలుకు బ్రేక్ పడింది. ఈ రెండు పథకాల కింద లబ్ధిపొందాలని ఆశించిన వారికి నిరాశే మిగిలిందని చెప్పవచ్చు.

కొల్లగొడుతున్నారు..

- జిల్లాలో పెరుగుతున్న చోరీలు
- ఇటీవల ఏటీఎం ఎత్తుకెళ్లేందుకు విఫలయత్నం
- బ్యాంక్‌లు, బైక్‌లను టార్గెట్ చేస్తున్న మరో ముఠా
- ఇతర రాష్ట్రాల ముఠాల పనేనని భావిస్తున్న పోలీసువర్గాలు



ఖలీల్‌వాడి : జిల్లాలో నేరాల పరంపర కొనసాగుతోంది. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న దుండగులు మళ్లీ అలజడి సృష్టిస్తున్నారు. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన వారు వేల కి.మీ నుంచి వచ్చి చోరీలకు పాల్పడుతున్నారు. పోలీసులు కేసులు నమోదు చేసినప్పటికీ నేరస్తు లు దొరకకపోవడంతో కేసులు పెండింగ్‌లో ఉంటున్నాయి.

జాతీయ రహదారి వెంట..

జాతీయ రహదారి వెంట ఏటీఎంలో దోపిడీ చేయడం హర్యానా ముఠాల స్టైల్. లారీలు, ట్రక్కులు ఇతర వాహనాల్లో వచ్చి ఏటీఎంలను కొల్లగొడుతున్నారు. వేల్పూర్ మండలం అంక్సాపూర్, మెండోరా మండలంలోని పోచంపాడ్ ఎక్స్ రోడ్డు వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో దొంగలు రూ.12 లక్షల వరకు చోరీ చేశారు. ఈ చోరీపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఏడాదిన్నర క్రితం ఇందల్వాయి మండల కేంద్రంలో ఏటీఎం నుంచి రూ. 11.31 లక్షలను దోచుకెళ్లారు. ఇప్పటివరకు పోలీసులు ఈ కేసును ఛేదించలేదు. యూపీకి చెందిన ఓ ముఠా జిల్లాలో మూడు చోట్ల చోరీలకు పాల్పడింది. జిల్లాలో మూడేళ్లలో అన్నిరకాల చోరీలు 346 కేసులకు పైగా నమోదయ్యాయి. రూ.45.49 కోట్లను దుండగులు ఎత్తుకెళ్లినప్పటికీ పోలీసులు సగం కూడా రికవరీ చేయలేదు.

బైక్‌లను మహారాష్ట్రకు..

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన దొంగలు ముఠా జిల్లాలో బైక్‌లు, వాహనాలను ఎత్తుకెళ్లిన ఘటనలున్నాయి. జిల్లాకు చెందిన బైక్ చోరీ ముఠాను ఇటీవల పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏడాది క్రితం రెండో టౌన్ పరిధిలో రూ.70 లక్షల విలువైన 42 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లాకు చెందిన వారు కర్ణాటక, మహారాష్ట్ర కేంద్రాలుగా చేసుకొని బైక్‌లను అమ్మేస్తున్నారు. జిల్లాలో చోరీ చేసిన బైక్‌లు మహారాష్ట్రకు తరలిస్తున్నారు.

బ్యాంక్‌లు, సెల్‌టవర్లు..

గతేడాది జూలైలో మెండోరాలోని బుస్సాపూర్‌లో యూపీకి చెందిన ముఠా సభ్యులు తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో దోపిడీకి పాల్పడ్డారు. గ్యాస్‌కట్టర్‌తో షెట్టర్‌ను తీసి 8 కిలోల 300 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లారు. రూ.7.30 లక్షల నగదు కాలిపోయింది. ఇందులో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ. 8.50 లక్షల బంగారంను స్వాధీనం చేసుకున్నారు. మిగితా రూ.4,45,15,000 కోట్లు బంగారం రికవరీ చేయాల్సి ఉంది. ఈ కేసు పెండింగ్‌లోనే ఉంది. జక్రాన్‌పల్లి ప్రాంతంలో నుంచి సెల్‌టవర్‌కు సంబంధించిన విలువైన సామగ్రిని యూపీకి చెందిన ముఠా ఎత్తుకెళ్లింది. ఈ కేసును పోలీసులు ఛేదించారు. వారిని ఢిల్లీ ప్రాంతంలో పట్టుకుని సామగ్రిని స్వాధీనం చేసుకుని, ముఠా సభ్యులను అరెస్ట్ చేశారు.

- వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్‌లో ఈనెల 10వ తేదీన యూనియన్ బ్యాంక్‌కు చెందిన ఏటీఎంను ఎత్తుకెళ్లేందుకు గుర్తుతెలియని వ్యక్తులు ప్రయత్నించారు. జీపీ ట్రాక్టర్‌ను చోరీ చేసి ఏటీఎం ఎత్తుకెళ్లడానికి ప్రయత్నించగా గ్రామస్తులు అరవడంతో అక్కడి నుంచి వారు పరారయ్యారు.
- మెండోరా మండలంలోని పోచంపాడ్ చౌరస్తాలోని 44వ జాతీయరహదారి వద్ద సెప్టెంబర్ 27న ఎస్‌బీఐ బ్యాంక్ ఏటీఎంను గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ మిషన్‌ను ధ్వంసం చేసి సుమారు రూ.12 లక్షల వరకు నగదు ఎత్తుకెళ్లారు. ఏటీఎంలోకి వెళ్లిన దొంగలు సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టి, గ్యాస్‌కట్టర్‌తో ధ్వంసం చేశారు.

దరఖాస్తులకు మోక్షమెప్పుడో..

- ధ్రువపత్రాల మంజూరులో తీవ్ర జాప్యం
- పెద్దల సేవలకు పెద్దపీట
- సామాన్యులకు తప్పనితిప్పలు



నల్లవెల్లి గ్రామానికి చెందిన వాడె గంగాధర్‌ ఫ్యామిలీ మెంబర్‌ సర్టిఫికెట్‌ కోసం ఆగస్టులో మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకొని తహసీల్‌ కార్యాలయంలో సంబంధిత పత్రాలను సమర్పించాడు. నాటి నుంచి నేటి వరకు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా సర్టిఫికెట్‌ మంజూరు కావడం లేదు. ఇదేంటని అడిగితే అధికారులు సెలవుల్లో ఉన్నారని, విచారణ చేపట్టడానికి సమయం పడుతుందని కార్యాలయ సిబ్బంది పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. రెండు నెలలు గడుస్తున్నా ధ్రువపత్రం మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు బాధితుడు పేర్కొన్నాడు.

ఇందల్వాయి: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సమస్యలపై తహసీల్‌ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులతో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యపు సమాధానాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందల్వాయి మండలంలోని తహసీల్‌ కార్యాలయంలో సమస్యలు, ధ్రువపత్రాల మంజూరు కోసం వచ్చే సామాన్య ప్రజలకు న్యాయం జరగడం లేదు. అధికారులు, సిబ్బంది లేకపోవడంతో చేసిన దరఖాస్తులు కుప్పలు కుప్పలుగా అధికారుల టేబుళ్లపై దర్శనమిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి, డబ్బున్న వారికి మాత్రం ఎలాంటి విచారణ లేకుండానే తక్షణమే ధ్రువపత్రాల మంజూరు, ఫిర్యాదులు పరిష్కారమవుతున్నాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. పేదల ప్రభుత్వమని చెప్పుకొనే బీఆర్‌ఎస్‌ హయాంలో సామాన్య ప్రజలకు న్యాయం జరగకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

మాయమవుతున్న దరఖాస్తులు..

తహసీల్‌ కార్యాలయంలో సమర్పించే కల్యాణలక్ష్మి, ఆదాయ, కుల, జనన, మరణ, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలు కొన్ని మాయమవుతున్నాయి. కార్యాలయంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులను జాగ్రత్తగా ఉంచాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంలో సరైన సమయంలో ధ్రువపత్రాలు మంజూరు కాక లబ్ధిదారులు, సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు ఆమ్యామ్యాలు ఇచ్చే వారి దరఖాస్తులను భద్రపరుస్తూ సామాన్య ప్రజలవి చెత్తబుట్టలో వేసే చిత్తు కాగిత్తాలా పడేస్తున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. రెండు నెలలుగా దరఖాస్తు చేసినా ధ్రువపత్రాలు మంజూరు కావడం లేదంటూ స్థానిక ప్రజలు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెలవుల్లో అధికారులు

అధికారుల అలసత్వానికి తోడు వీఆర్వోలు, వీఆర్‌ఏలు కార్యాలయంలో లేక పోవడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. కార్యాలయంలో అటు అధికారులు లేక ఇటు సిబ్బంది లేక తమ దరఖాస్తులు, ధ్రువపత్రాలు ఎలా మంజూరవుతాయో వీటికి మోక్షమెప్పుడో అని అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం తరచూ సెలవుల్లో ఉండడంతో ధ్రువపత్రాల పరిశీలన, విచారణ వేగవంతంగా జరగడం లేదు. డిప్యూటీ తహసీల్దార్‌ విధుల్లో చేరి నాలుగు నెలలవుతున్నా ఏనాడూ కార్యాలయానికి సరిగా రావడం లేదు. ప్రస్తుతం సదరు అధికారి సెలవుల్లో ఉన్నా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించక పోవడంతో పహాణీ నకల్లు అందించడంతో పాటు ఇతర సేవల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది.


ఇందల్వాయి తహసీల్‌ కార్యాలయం


ఆర్‌ఐ టేబుల్‌పై ఉన్న దరఖాస్తులు


నెల రోజులుగా ఖాళీగా ఉన్న డీటీ చైర్‌

సిబ్బంది లేక ఆలస్యం..

వీఆర్‌ఏలు లేక పోవడం, అధికారులు సెలవుల్లో ఉండడం, ఆర్‌ఐ బదిలీ కావడంతో దరఖాస్తులు, ధ్రువపత్రాల మంజూరులో ఆలస్యమవుతోంది. దీనికి తోడు ఎన్నికల విధులు అదనంగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. ధ్రువపత్రాలు త్వరగా మంజూరయ్యేలా సిబ్బందితో కలిసి కృషి చేస్తాం.

–వెంకట్‌రావు, తహసీల్దార్‌, ఇందల్వాయి

క్లుప్తంగా

బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సాయిలు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ సారంగపూర్‌ క్యాంపస్‌ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సాయిలు నియామకమయ్యారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ యాదగిరి సాయిలుకు నియామక ఉత్తర్వులను బుధవారం అందజేశారు. తనపై నమ్మకంతో ప్రిన్సిపాల్‌గా నియమించిన ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌లకు సాయిలు కృతజ్ఞతలు తెలిపారు.

ఎకనామిక్స్‌ బీవోఎస్‌ చైర్మన్‌గా సంపత్‌



తెయూ(డిచ్‌పల్లి): తెయూ యూనివర్సిటీ ఎకనామిక్స్‌ డిపార్ట్‌మెంట్‌ బోర్డ్‌ ఆఫ్‌ స్టడీస్‌ (బీవోఎస్‌) చైర్మన్‌గా టి.సంపత్‌ నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ యాదగిరి సంపత్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. తనపై నమ్మకంతో బీవోఎస్‌ చైర్మన్‌గా నియమించిన ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్‌లకు సంపత్‌ కృతజ్ఞతలు తెలిపారు.

పెద్దవాగులో ఇసుక రవాణా నిషేధం



వేల్పూర్‌: మండలంలోని జానకంపేట్‌, పచ్చలనడ్కుడ గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగులో ఇసుక రవాణా చేయడం నిషేధించినట్లు పోలీసులు, రెవెన్యూ అధికారులు బుధవారం తెలిపారు. తమ ఆంక్షలను ఎవరైనా ధిక్కరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెద్దవాగు నుంచి కొంతకాలంగా పచ్చలనడ్కుడ గ్రామస్తులు ఇసుక తీయనీయడం లేదని జానకంపేట్‌ గ్రామస్తులు కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారులు ఇరు గ్రామాల ప్రజలు ఇసుక తీయకుండా ఆంక్షలు విధించినట్లు ఏఎస్సై యాదగిరి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ వేణు తెలిపారు.

కమ్మర్‌పల్లిని సందర్శించిన తమిళనాడు రైతులు

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానాన్ని తమిళనాడులోని ఈరోడ్‌ ప్రాంత రైతులు బుధవారం సందర్శించారు. అక్కడి వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో 23 మంది రైతులు ఎక్స్‌పోజర్‌ విజిట్‌లో భాగంగా పరిశోధన స్థానానికి వచ్చారు. జిల్లాలో పసుపు సాగు విధానం, పసుపు పంటలను పరిశీలించారు. పరిశోధన, సాగు పద్ధతులు, మెళకువలను ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ మహేందర్‌, శాస్త్రవేత్త శ్రీనివాస్‌ను రైతులు అడిగి తెలుసుకున్నారు. సాగులో నూతన పరిజ్ఞానం గురించి పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా రైతులకు శాస్త్రవేత్తలు వివరించారు. స్పైసెస్‌ బోర్డు సూపరింటెండెంట్‌ రామాణిక్యం, రైతులు ఉన్నారు.


పసుపు పంటను సందర్శిస్తున్న రైతులు

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్‌ నమోదు


అమీర్‌కు నోటీసులు అందజేస్తున్న సీఐ

ఖలీల్‌వాడి: నగరంలోని ఆటోనగర్‌ ప్రాంతానికి చెందిన అమీర్‌, అలీఖాన్‌ అలియాస్‌ బర్సత్‌ అమేర్‌పై పోలీసులు పీడీ యాక్ట్‌ నమోదుచేసి జైలుకు బుధవారం తరలించారు. అమీర్‌ 2019 నుంచి అనేక నేరాలకు పాల్పడడంతో పోలీసులు అభియోగపత్రాన్ని నమోదు చేశారు. సీపీ ఆదేశాల మేరకు అమీర్‌కు నోటీసులు అందించి జైలుకు తరలించినట్లు సీఐ వెంకట్‌నారాయణ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌ గోదావరి


విద్యార్థులను అభినందిస్తున్న సర్పంచ్‌, హెచ్‌ఎం

డిచ్‌పల్లి: మండలంలోని సుద్దపల్లిలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి ఎంఎల్‌బీ బేస్‌బాల్‌ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ గోదావరి బుధవారం తెలిపారు. ఇటీవల సుద్దపల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన ధరణి, దర్శిని, నిశిత, భావన, భవ్య, శ్రీవాణి, స్వస్తిక, మిథున, నవజ్యోతి, చక్రిక, షెర్లిన్స్‌సీ షైనీ, సైలస్య విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 12 నుంచి 14 వరకు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్‌ తెలిపారు. అనంతరం విద్యార్థినులను ప్రిన్సిపాల్‌ గోదావరితో పాటు పీఈటీ లత, కోచ్‌ మౌనిక అభినందించారు.

రాష్ట్రస్థాయి ఎంఎల్‌బీ బేస్‌బాల్‌ పోటీలకు మిట్టాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు కె.కిశోర్‌, ఈ.శ్రీకాంత్‌ ఎంపికైనట్లు హెచ్‌ఎం సుశీల్‌కుమార్‌ తెలిపారు. పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను సర్పంచ్‌ గణేష్‌, హెచ్‌ఎం సుశీల్‌కుమార్‌, వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఉప సర్పంచ్‌ సరస్వతీకిషన్‌, ఉపాధ్యాయులు మర్కంటి గంగామోహన్‌, రాఘవేందర్‌ రావు, రాజశేఖర్‌, నిరంజన్‌ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత


బోధన్‌లో మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్‌

బోధన్‌టౌన్‌(బోధన్‌): బోధన్‌ పట్టణంతో పాటు సాలూర చెక్‌ పోస్టు వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీల్లో రూ.11లక్షల80వేలు పట్టుకున్నట్లు ఏసీపీ కిరణ్‌కుమార్‌ బుధవారం తెలిపారు. పట్టణంలోని ఎల్‌బీఎస్‌ నగర్‌కు చెందిన సాలంపాడ్‌ మాజీ సర్పంచ్‌ పెద్దిరెడ్డి రూ. 9 లక్షలతో ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పట్టణంలోని అనిల్‌ టాకీస్‌ చౌరస్తాలో, షేక్‌ షఫీ ద్విచక్ర వాహనంపై రూ. లక్షా80 వేలతో అదే చౌరస్తాలో వెళ్తుండగా వాహనాల తనిఖీలో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు లేక పోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. సాలూర మండలంలోని చెక్‌ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన మహదేవ్‌ నుంచి రూ.లక్షతో ద్విచక్ర వాహనంపై బోధన్‌ వైపునకు వస్తున్నట్లు తెలిపారు. ఈ నగదును ఫ్లైయింగ్‌ స్క్వాడ్‌ అధికారి ఆంజనేయులుకు అప్పగించామన్నారు.

భయాందోళనకు గురి కావొద్దు

ఎన్నికల షెడ్యూలు విడులైన సందర్భంగా పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీల్లో డబ్బులు పట్టుబడితే, నగదుకు సంబంధించిన ఆధారాలు చూపితే అప్పగిస్తామని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలు తమ అవసరాల నిమిత్తం రూ. 50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకెళ్లద్దని సూచించారు. మద్యం, డబ్బుల పంపిణీని అరికట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో సీఐ ప్రేమ్‌కుమార్‌, ఎస్సై శ్రీనివాస్‌, సిబ్బంది ఉన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టులో..

మద్నూర్‌(జుక్కల్‌): మండలంలోని సలాబత్‌పూర్‌ వద్ద తెలంగాణ–మహారాష్ట్ర సరిహద్దులో ఎన్నికల సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ వద్ద పోలీసులు రూ.2.40 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్రలోని దెగ్లూర్‌ నుంచి సలాబత్‌పూర్‌ మీదుగా స్విఫ్ట్‌ కారులో వెళ్తున్న ఇమామ్‌ఖాన్‌ అనే వ్యక్తి వద్ద ఈ నగదు లభించడంతో పోలీసులు పట్టుకున్నారు. సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్‌ చేసినట్లు తెలిపారు. ఫ్లయింగ్‌ స్క్వాడ్‌ కోశిడ్గేవార్‌ మహేశ్‌, తహసీల్దార్‌ మహమ్మద్‌ ముజీబ్‌, ఎస్సై కృష్ణారెడ్డి, ఆర్‌ఐ శంకర్‌, సిబ్బంది ఉన్నారు.


సలాబత్‌పూర్‌లో మాట్లాడుతున్న పోలీసులు

ఎస్‌ఎస్‌ఆర్‌ కళాశాల వద్ద..

నిజామాబాద్‌రూరల్‌: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు చేపడుతున్న నాకాబందీ కార్యక్రమంలో భాగంగా ఎస్‌ఎస్‌ఆర్‌ జూనియర్‌ కళాశాల వద్ద బైక్‌ నుంచి రూ.లక్షా 50వేలు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహేశ్‌ కుమార్‌ తెలిపారు. ఈ నగదును జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతుకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పరిధిలో వాహనాల తనిఖీల్లో నలుగురు వ్యక్తుల నుంచి నగదుతో పాటు బంగారం లభించినట్లు ఎస్‌హెచ్‌వో విజయబాబు తెలిపారు. తనిఖీల్లో నలుగురు వ్యక్తుల నుంచి రూ.1,18,500, రూ.2.50 లక్షలు, రూ.68,500, రూ.92,600 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో వ్యక్తి నుంచి 25 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని సీజ్‌ చేసి విచారణ నిమిత్తం ఎంసీసీ బృందానికి అప్పగించినట్లు పేర్కొన్నారు.

భిక్కనూరు చెక్‌పోస్టు వద్ద..



భిక్కనూరు: మండల సమీపంలోని చెక్‌పోస్టు వద్ద తనిఖీలో భాగంగా ఒకరి నుంచి రూ.లక్షాయాభై వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తిరుపయ్య, ఎస్సై సాయికుమార్‌ తెలిపారు. తాడ్వాయి మండలం ఎర్రపహడ్‌కు చెందిన సుధాకర్‌గౌడ్‌ కారులో హైదరాబాద్‌ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా తనిఖీలో నగదు లభించిందన్నారు. ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసులపై నమ్మకం కలిగేలా చూడాలి

రిటైర్డ్‌ ఐజీ ఆనందవర్ధన్‌ శుక్లా


మాట్లాడుతున్న రిటైర్డ్‌ ఐజీ ఆనందవర్ధన్‌ శుక్లా

ఖలీల్‌వాడి: సమస్యలపై పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి పోలీసులపై నమ్మకం కలిగేలా విధులు నిర్వర్తించాలని రిటైర్డ్‌ ఐజీ ఆనందవర్ధన్‌ శుక్లా సూచించారు. నగరంలోని సీపీ కార్యాలయంలో బుధవారం 'సాఫ్ట్‌ స్కిల్స్‌ డెవలప్‌మెంట్‌'పై వర్క్‌షాప్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను సహనంతో పరిష్కరించాలన్నారు. వాహనాల తనిఖీల్లో నాకాబందీల్లో పోలీసులు వ్యవహరించాల్సిన తీరుపై వివరించారు. ప్రతీ ఒక్కరూ కోపాన్ని అదుపులో పెట్టుకోవాలని సూచించారు. ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలన్నారు. అనంతరం పలు రాష్ట్రాల్లో ఉన్న పోలీసింగ్‌ గురించి పవర్‌ పాయింట్‌ ప్రజెంటేషన్‌ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్‌ కమిషనర్‌ వి. సత్యనారాయణ, డిప్యూటీ కమిషనర్‌ ఆఫ్‌ పోలీస్‌ ఎస్‌. జయ్‌రాం, ఏసీపీలు, స్పెషల్‌ బ్రాంచ్‌ ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రైం కార్నర్‌

వేర్వేరు ఘటనల్లో పలువురి మృతి


బండి రామగిరి (ఫైల్‌)

భిక్కనూరు: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సాయి కుమార్‌ కుమార్‌ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్‌ బండి రామగిరి (38) మంగళవారం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం మండల కేంద్రానికి సమీపంలోని ఓ దాబా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. గమనించిన స్థానికులు, దాబా సిబ్బంది కుటుంబీకులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికుమార్‌ పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు..


కృష్ణమూర్తి (ఫైల్‌)

పెద్దకొడపగల్‌(జుక్కల్‌): పెద్దకొడపగల్‌ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై కోనారెడ్డి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన కామరాజు కృష్ణమూర్తి(24) ఉదయం పొలం నుంచి పచ్చిగడ్డి తీసుకొస్తుండగా పిట్లం నుంచి బిచ్కుంద వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం కృష్ణమూర్తిని ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్‌ షాక్‌తో ఒకరు..

బోధన్‌టౌన్‌: బోధన్‌లోని నర్సాపూర్‌కు చెందిన భైరి రాజు(38) బుధవారం విద్యుత్‌ షాక్‌తో మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. నర్సాపూర్‌కు చెందిన రాజు వ్యవసాయ కూలీగా పని చేసేవాడు. బుధవారం సాయంత్రం నర్సాపూర్‌ శివారు ప్రాంతంలోగల బోరు మోటారు సమీపానికి వెళ్లాడు. అక్కడ తెగి పడి ఉన్న విద్యుత్‌ వైరుపై కాలు పెట్టడంతో షాక్‌ కొట్టి మృతి చెందాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రైలు కింద పడి మరొకరు..

ఖలీల్‌వాడి: ఎడపల్లి మండలం జాన్కంపేట్‌ రైల్వే పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై తావూనాయక్‌ తెలిపారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాల వరకు ఉంటుందని అన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే 8712658591 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు.

కెమికల్‌ ఫ్యాక్టరీలో..


బబ్లూ మృతదేహం

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులోని కెమికల్‌ ల్యాబరేటరీలో బుధవారం జరిగిన ప్రమాదంలో ఒక్కరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. జంగంపల్లి శివారులో ని విజయసాయి కెమికల్‌ ల్యాబరేటరీలో బుధవారం వేకువ జామున సాల్వెంట్‌ డ్రమ్మును అన్‌లోడ్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అపరేటర్లుగా పనిచేస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన బబ్లూ (48), ఉత్తర ప్రదేశ్‌కు చెందినన జగదీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ బబ్లూ మృతి చెందాడు. జగదీశ్‌ పరిస్థితి విషమంగా ఉంది.

రోడ్డు ప్రమాదంలో మహిళ..


సంధ్యారాణి (ఫైల్‌)

మాచారెడ్డి: మండలంలోని భవానీపేట–ఆరెపల్లి గ్రామాల మధ్య బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. పాల్వంచ మండలం ఫరీద్‌పేటకు చెందిన తగిరంచ సంధ్యారాణి (28) జ్వరంతో బాధపడుతోంది. సమీప బంధువు ద్విచక్ర వాహనంపై కామారెడ్డి ఆస్పత్రికి తీసుకవెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్‌ వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ సంధ్యారాణి అక్కడికక్కడే మృతిచెందింది. సంధ్యారాణి కుమారుడు భువంత్‌రెడ్డి, కూతురు భవ్యశ్రీలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. సంధ్యారాణి భర్త ఏడాది క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఇద్దరు చిన్నారులు అనాథలయ్యారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిందితుడి అరెస్ట్‌

కామారెడ్డి క్రైం: వృద్ధురాలి మెడలో నుంచి బంగారు గొలుసు దొంగిలించిన నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అనిల్‌ బుధవారం తెలిపారు. ఈ నెల 9న గాంధీ గంజ్‌ ప్రాంతంలో ఓ వృద్ధురాలి ఇంట్లో నిందితుడు ప్రవేశించి ఆరు తులాల బంగారు గొలుసుని లాక్కుని పరారయ్యాడు. నిందితుడిని మెట్‌పల్లికి చెందిన యాదగిరిగా గుర్తించగా కామారెడ్డిలో పట్టుకుని కేసు నమోదు చేశారు.

జేసీబీ సీజ్‌

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని చీనూర్‌లో జేసీబీతో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టిన యజమాని ఆసీఫ్‌కు రూ. పదివేల జరిమానా విధించి జేసీబీని సీజ్‌ చేసినట్లు తహసీల్దార్‌ మహేందర్‌కుమార్‌ తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవన్నారు.

పేకాట స్థావరంపై దాడి

వర్ని: మండలంలోని పొట్టిగుట్ట అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో రూ. 52,360 నగదు, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్‌ తెలిపారు.

లింగాపూర్‌ శివారులో..

కామారెడ్డి క్రైం: మున్సిపల్‌ పరిధిలోని లింగాపూర్‌ శివారులో పేకాటస్థావరంపై పోలీసులు దాడి చేశారు. దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.24,780 నగదు, 2 బైకులు, 6 సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి


సరిత (ఫైల్‌)

రాజంపేట: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని షేర్‌ శంకర్‌ తండాలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై సంపత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కాట్రోత్‌ సూర్య భార్య సరిత (30), అతని తమ్ముడు కాట్రోత్‌ సర్దార్‌ భార్య రాజేశ్వరిల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. మంగళవారం రాత్రి సైతం సరిత, రాజేశ్వరిల మధ్య కుటుంబ విషయంలో పెద్ద గొడవ జరిగింది. బుధవారం ఉదయం సరిత అనుమానాస్పదస్థితిలో మృతిచెందింది. విషయం తెలుసుకున్న సరిత తల్లిదండ్రులు, కుటుంబీకులు పెద్ద ఎత్తున తండాకు తరలివచ్చి సూర్య, సర్దార్‌, రాజేశ్వరీలపై దాడి చేయడంతో వారు పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గొడవను సద్దుమనిగించారు. అనంతరం మృతురాలి తండ్రి మాలోత్‌ మోజీరాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైపేర్కొన్నారు.

శెట్పల్లిసంగారెడ్డిలో..


కమలవ్వ (ఫైల్‌)

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి గ్రామానికి చెందిన మద్దెల కమలవ్వ(65) అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్‌ తెలిపారు. మృతురాలు రెండు రోజులు గా కనిపించకపోవడంతో గ్రామస్తులు హైదరాబాద్‌లో ఉంటున్న కొడుకు వినోద్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. బుధవారం సాయంత్రం ఇంట్లోకి వెళ్లి చూడగా కమలవ్వ మృతి చెంది ఉంది. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్‌, సదాశివనగర్‌ సీఐ, లింగంపేట ఎస్సై ప్రభాకర్‌ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బంగారం కోసం వృద్ధురాలిని దుండగులు హత్య చేసి ఉంటాని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఆర్మూర్‌టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌లోని ఓ ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. విశాఖ కాలనీలో అద్దెకు ఉంటున్న ఐసీడీఎస్‌ సీడీపీవో భార్గవి వారం రోజుల క్రితం ఇంటికి తాళం వేసి స్వగ్రామానికి వెళ్లారు. బుధవారం ఉదయం చోరీ జరిగినట్లు గుర్తించిన స్థానికులు ఆమెకు సమాచారం అందించారు. సీడీపీవో వచ్చి చూడగా బీరువాలో ఉన్న రూ. 50వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు భార్గవి తెలిపారు.